క్లుప్తంగా

పాదయాత్రకు సంఘీభావం


మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రలో పాల్గొన్న ఎంపీపీ ఈరన్న తదితరులు

అమరాపురం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ను పునరుద్ధరించాలని కోరుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. అమరాపురం ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం శెట్టూరు మండలం యాటకల్లులో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నారు. ఆర్డీటీ సేవలు నిలిచిపోతే ఉమ్మడి అనంతపురం జిల్లా నష్టపోతుందని ఎంపీపీ ఈరన్న తెలిపారు.

నరసింహభట్టాచార్యులు కన్నుమూత


నరసింహభట్టాచార్యులు (ఫైల్)

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో పూజలు, వ్రతాలు, పెళ్లిళ్లు చేస్తూ ప్రధాన అర్చకుడిగా పేరు పొందిన నరసింహభట్టాచార్యులు (70) అనారోగ్యంతో శనివారం ఉదయం కన్నుమూశారు. 35 ఏళ్లుగా వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా సేవలందించారు. కోట వీధిలోని ఆంజనేయస్వామి, బస్టాండు దగ్గరున్న శనీశ్వరస్వామి, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న షిర్డిసాయి ఆలయంలో పూజలు చేసేవారు. ఆయన మృతికి ఆర్య వైశ్యులతో పాటు స్థానిక ప్రజలు సంతాపం తెలియజేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణోత్సవం


కల్యాణం జరిపిస్తున్న స్వరూపానందేంద్ర స్వామి

పావగడ: నియోజకవర్గ పరిధిలోని సంకాపుర సువర్చలాంజనేయస్వామి దేవాలయంలో సువర్చల సమేత ఆంజనేయస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పావగడ సర్వధర్మ శరణాలయ ట్రస్టు అధిపతి స్వరూపానందేంద్రస్వామి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామి కల్యాణాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమష్టి కృషితో బ్రాహ్మణ సంఘం అభివృద్ధి


మాట్లాడుతున్న మురళీదేశాయ్

హిందూపురం: బ్రాహ్మణ సంఘ సభ్యులందరూ సమష్టిగా కృషి చేస్తూ సంఘాన్ని అభివృద్ధి చేసుకుందామని ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు మురళీదేశాయ్ పిలుపునిచ్చారు. ఏపీ బ్రాహ్మణ సేవ సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు అధ్యక్షతన సంఘ పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీవాణి, మారుతీరావు, రాజేంద్రప్రసాద్, ఆదినారాయణరావు, శివానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి మల్లికార్జున, రామమూర్తి, సతీష్ , వెంకటరమణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

స్నేహం, తాగ్యానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ఈద్గాలు, మసీదుల్లో శనివారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలందరూ కరుణ, ధర్మం, త్యాగం చేయాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. ఖుర్బానీలన్నీ దైవాన్ని చేర్చలేవని భయ భక్తులు, ప్రేమభావంతో భక్తితో చేసే అల్లా ప్రార్థనలు, దానాలు, త్యాగాలు మాత్రమే దైవకృపాకు చేరువ చేస్తాయన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రొళ్లలో ఈద్గా మైదానానికి వెళ్తున్న ముస్లింలు


పెనుకొండ: బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు


గోరంట్ల: కిటకిటలాడుతున్న ఈద్గా


రొద్దం: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


సోమందేపల్లిలో...


లేపాక్షిలో...


పావగడ: ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


అమరాపురం ఈద్గా మైదానంలో ..


హిందూపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బాబురెడ్డికి ఘన నివాళి



బాబురెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ , ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు శంకరనారాయణ

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త బాబురెడ్డి అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామమైన చలాపల్లిలో నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, చిత్తూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చవ్వా రాజశేఖర్‌రెడ్డి, యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్, హిందూపురం సమన్వయకర్త దీపిక, ఏపీ స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ ఓబిరెడ్డి, నాయకులు చరణ్‌రెడ్డి, మధుమతి, మండల కన్వీనర్లు గజేంద్ర, సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బాబురెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ఆటో - ద్విచక్రవాహనం ఢీ

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో పావగడ - పెనుకొండ ప్రధాన రహదారిపై శనివారం ఆటో - ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తికి గాయాలైనట్లు గ్రామస్తులు చెప్పారు. మండల పరిధిలోని బీదానిపల్లికి చెందిన కురుబ సంజీవప్ప సంతలో సరుకుల కోసం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఆటో - బైక్ ఢీ కొన్నాయన్నారు. గాయపడిన సంజీవప్పను ప్రైవేట్ వాహనంలో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

దళితులపై దాడులను అరికట్టండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిరరూరల్: రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై టీడీపీ సానుభూతిపరులు అత్యాచారానికి పాల్పడినా ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, దళిత ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడలేకపోతున్నారో చెప్పాలన్నారు. దళితులపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి కోటి పరిహారం అందించడంతో పాటు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మడకశిర అభివృద్ధికి చేసింది ఏమీలేదని, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించేస్థాయి ఆయనకు లేదన్నారు. పదవుల కొందరు నాయకులు వైఎస్సార్‌సీపీపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను టీడీపీ నాయకులు విమర్శించడం మానుకొని మడకశిర ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టాల్సింది పోయి ప్రోత్సహిస్తున్నారని, పేదలపై ప్రేమ ఉంటే బెల్టుషాపులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కుంచిటి వక్కలిక విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి, నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులు మల్లికార్జున, శేషాద్రి, నరసింహా, కెంచప్ప, లక్ష్మీనరసప్ప, ఎస్సీ సెల్ మండల నాయకులు రంగనాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రోగుల చికిత్సకు రూ.13 కోట్ల వ్యయం


కుష్టు రోగులతో స్వామి జపానంద

పావగడ: ఇప్పటిదాకా 650 మంది కుష్టు రోగుల చికిత్సకు రూ.13 కోట్ల వ్యయం అయిందని స్వామి జపానంద తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మూడు నెలలుగా చికిత్స పొంది ఆరోగ్యవంతులైన ఐదు మంది కుష్టు బాధితులను స్వామి జపానంద శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాలుగా కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి అనేక మంది కుష్టు రోగులు ఇక్కడకు వచ్చి చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వైద్యులు డా చంద్రకళ, డా ప్రమోద్ తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: మండలంలోని సిరిగారిపల్లిలో శనివారం సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వేద పండితులు వట్టిపల్లి నరసయ్య శాస్త్రి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారిని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి ఆభరణాలు, వివిధ రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మానవసేవ చేయడం గొప్పవిషయం

హిందూపురం: పట్టణంలోని 11వ వార్డు మోడల్ కాలనీలో శనివారం సహస్ర ప్రణామ్ అనాథ ఆశ్రమాన్ని మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి ప్రారంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగా నమ్మి సహస్ర ప్రణామ్ అనాథ ఆశ్రమం నిర్వాహకులు సమాజం కోసం తమ వంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఆదిత్య, చంద్రాయుడు, బీజేపీ నాయకులు రవికుమార్, నాగలక్ష్మి, పద్మమ్మ, లక్ష్మమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోపాలు సవరించాలి

ఓడీచెరువు: ఎస్జీటీ ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాలోని లోపాలను సవరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జార్జి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు గౌస్‌లాజమ్ అధికారులను కోరారు. ఈమేరకు శనివారం వారు అనంతపురం జిల్లా డీఈఓ ప్రసాద్ బాబు, ఆర్జెడీ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యా నిలయం 'హిందూపురం'

హిందూపురం టౌన్: హిందూపురం విద్యానిలయంగా మారింది. ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు హిందూపురం ఓ బలమైన పునాదిని వేస్తోంది. ఒకప్పుడు 10వ తరగతి, ఇంటర్ ఆ తర్వాత ఉన్నత చదువులకు వెళ్లాలంటే బయటకు ప్రాంతాలకు వెళ్లే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు హిందూపురంలోనే ఉన్నత స్థాయిలో విద్యాబోధన అందుతోంది. 10వ తరగతికే ఎంతో ఉత్తమ సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ క్లాసులు, సీబీఎస్‌ఈ సిలబస్‌ను బోధించే విద్యా సంస్థలు రావడంతో నియోజకవర్గంలోని విద్యార్థులతో పాటు సమీప ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా ఏ ఇబ్బంది లేకుండా పోయింది. విద్యారంగం విషయంలో హిందూపురం ఎంతో అభివృద్ధి చెందింది. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకామ్, డీఎడ్, బీఎడ్, ఫార్మసీ కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోనే హిందూపురం విద్యాకేంద్రంగా ప్రసిద్ధి చెందింది. హిందూపురం పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడి పాఠశాలలు, కళాశాలలకు వస్తుంటారు. ఇక్కడి విద్యార్థులు వివిధ రకాల పరీక్షల్లో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందారు. 10వ తరగతి పరీక్షల ఫలితాల్లోనే రాష్ట్రస్థాయిలో రాణించారు. పలు విద్యాసంస్థల్లో సైన్స్, గణిత ప్రయోగశాలలు ఉన్నాయి. సువిశాలమైన భవనాలు, ప్రశాంతమైన వాతావరణంలో విద్యాసంస్థలు కొనసాగుతుండటంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

తగ్గిన ఉత్తీర్ణత శాతం

మడకశిర: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈసారి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం బాగా తగ్గింది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలను శనివారం విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. గత ఏడాది ఫలితాలతో పోల్చుకుంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం బాగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు 101 మంది పరీక్షలు రాశారు. కేవలం 21 మంది మాత్రమే పాసయ్యారు. మిగిలిన 80 మంది ఫెయిల్ అయ్యారు. అలాగే రెండో సంవత్సరం విద్యార్థులు 40 మంది పరీక్షలు రాశారు. కేవలం 16 మంది మాత్రమే పాసయ్యారు. మిగిలిన 24 మంది ఫెయిల్ అయినట్లు అధికారులు తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతిభ

మడకశిర: పట్టణంలోని వేంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో సత్తా చాటారు. ఎంపీసీలో నయన, నాగరత్న, యాసిర్ 470 మార్కులకు గాను 465 మార్కులు, సాహితి, యమున, ప్రశాంత్, హేమంతరాజు 464 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు గాను నిఖిత 432, సహన, సుకన్యలకు 431 మార్కులు వచ్చాయి. సీఈసీలో 500 మార్కులకు హారికకు 486, పావని 484, సంధ్య 483 మార్కులు చొప్పున సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, కరస్పాండెంట్ మధు అభినందించారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం


మట్టి పరీక్షల పత్రాలను అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. తద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హరిణి, శిరీష తెలిపారు. శనివారం ఆమిదాలగొంది ఉన్నత పాఠశాల ఆవరణలో ఆమిదాలగొంది, మడకశిర రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, రసాయ ఎరువు వాడకాన్ని తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పాలన్నారు. పంటల సాగులో రైతులు వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ తిమ్మప్ప, రైతు సేవా కేంద్రాల సిబ్బంది మమత, స్రవంతి, నాగలక్ష్మి, ఇఫ్కోటోకియా ఫీల్డ్ మేనేజర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల వాడకం తగ్గించాలి

గుడిబండ: పంటసాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త బాలాజీనాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రాళ్లపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటసాగులో నూతన వంగడాలను ప్రోత్సహించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవడంతో ఖర్చు తగ్గడంతో పాటు లాభాలు కూడా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వీరనరేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.